# దెయ్యాలు

"ఏం చేస్తున్నావురా యిప్పుడు?"

"వుండలు."

"అంటే?"

"మాత్రలు."

"మాత్రలు చేయడమంటే?

"వైద్యం"

"ఓహో!.... ఏం వైద్యం?"

"అన్నిటికీనీ, ముఖ్యం హిస్టీరియాకి!"

"ప్రసిద్ధికెక్కిన హిస్టీరియా గజపంచాననం నువ్వు కాదుకదా!"

"సందేహ మెందుకు?"

"నువ్వే! నువ్వే! ఏమదృష్టంరా!"

"ఎవరికి?"

"ఎవరికేమిటి ! నీకే !"

"నాకా ?"

"బూకరించకు. నీ ఖ్యాతిని వినందెవరు ?

"వుత్త ఖ్యాతే! అంతే!"

"డబ్బో! ఇంక ఆడవాళ్లా!"

"ఆడవాళ్ళేమిటి!!!"

"నన్ను దబాయించకు మరి! హిస్టీరియా యెవరికొస్తుందిరా ? ఇంకేం ? అందులో తక్కిన జబ్బువలె కాదు. హిస్టీరియా కుదర్చాలంటే, రోగితో రాత్రులంతా వొంటరిగా మేలుకు కూచోవాలి. ఆ రోగిచేసే పనులకు ఆ రోగి బాధ్యత వుండదు. వాళ్ళ తెలీదు కనక. నిజంగా అది హిస్టీరియా అవునో కాదో, నువ్వు నిర్ణయించవలసిందేగాని, యింకెవరికీ తెలీదు వొరే, ఎంత అదృష్టవంతుడివిరా ! మనతో చదువుకున్న సూర్యనారాయణ కలెక్టరయినాడు; వెంకటేశ్వర్లు ఆ లక్షరూపాయల పిల్లతో లేచిపోయినాడు; రామనాథం సినీమా తార ఐనాడు. వాళ్ళు ముగ్గురే అదృష్టవంతులు మన జట్టులో అనుకుంటున్నా. కాని నీ ముందు—"

"అట్లానే అనుకోరా!"

"నువ్వెన్ని చెప్పినా నమ్మను. నాకు తెలుసు. నీ కీర్తి చాలా విన్నాను. ఆడవాళ్ళ సంగతి అబద్ధమంటావా?"

"అనను. కాని ఆడవాళ్ళు అదృష్టమంటే వొప్పుకోను."

"అట్లాగా ! నువ్వు నిష్ప్రయోజకుడివి వనుకోలేదు నేను."

"అది కాదురా...."

"పోరా, దొంగ మాటలూ నువ్వూను ! చిన్నప్పుడూ అంతే! పరీక్ష శుభ్రంగా వ్రాసివొచ్చి, ఏమీ వ్రాయలేదని దొంగయేడుపులు ఏడ్చేవాడివి ! నాకు తెలుసులేరా."

"ఏం తెలుసు నీకు? నీ మొహం తెలుసు. లోకంలో మనుష్యులు తెలుసుననుకునేవన్నీ యింతేననుకో, మొన్న జరిగిన ఓ కేసు సంగతి విను. నీకే తెలుస్తుంది. ఆ ఆడవాళ్లూ అదృష్టమూ ఏమిటో? వింటావా ?"

"కానీ"

"ఆ పూళ్ళో...."

"ఏ పూళ్ళో?"

"ఏదో వొక పూరు. నీకెందుకు? వెడదామన్నా లాభం లేదు. హిస్టీ రియా స్పెషలిస్టు వైతే తప్ప."

"ఆ వూళ్ళో...."

"చూశావా? రహస్యం అప్పుడే."

"ఏడిశావులే! విను ముందు. ఆ వూళ్ళో ఓ వర్తకుడి భార్యకి హిస్టీ రియా. ఎక్కడా ఎవరిచాతా నయం కాకపోతే, నా కీర్తి విని నన్ను తీసి కెళ్ళారు. నా థియరీ యేమిటంటే, హిస్టీరియాకి యెప్పుడూ భర్త బాధ్యు డని. కనక...."

"వుండు. భర్తలేని వాళ్ళకీ వొస్తుందే!"

"భర్త లేకపోవడం, భర్త తప్పేగా!"

"బావుంది. కానీ...."

"కాపరానికి వొచ్చిన మూడేళ్ళ నుంచీ జబ్బే. ఆ భర్త అర్భకత్వం చూసేప్పటికే రోగం కారణం అర్థమయింది నాకు. వొంటరిగా రోగిని గదిలో బంధించి 'ట్రీట్' చేసి, నయం చేశాను. నాకు మంచి ఫీజు యిచ్చా డా వర్తకుడు."

"ఇంకేం? అదే నేను...."

"విను మరి. కథ ముగియలేదు. కాని వారానికే మళ్ళీ ఫిట్ వొచ్చి నన్ను పిలిపించారు. మళ్ళీ అంతట్లో జబ్బు తిరగపెడుతుం దనుకోలేదు. ఏం చెయ్యను? వెళ్ళి నయం చేశాను. అటుతరువాత రోజువిడిచి రోజు ఫిట్ రావడం ప్రారంభించింది. నేను వెళ్ళి మంత్రిస్తేనేగాని నయంకాదు. ఎన్ని వారాలైనా ఆ కేసు ఆఖరుకాదు. ఆ పిల్లకి పట్టిన దెయ్యంతో తంటాలు పడుతూ వుండగానే, ఆమె ఆడబిడ్డ—ముప్పై యేళ్ళ వితంతువు- ఆమెకి దెయ్యం పట్టింది."

"అదే నేననేది...."

"నోరు ముయ్యి. విను."

"ఏం చెయ్యను? అదో తమాషా! యీమెకి ఫిట్ వొచ్చినప్పుడే ఆమెకి ఆవేశం; ఆమెకి ఆవేశం పూనినప్పుడే యీమెకి ఫిట్! చూశావా! మరి వైద్యమంటే తడాఖా! స్కూల్లో కుర్చీలో కునికిపాట్లు పడడమనుకున్నావా యేమిటి?"

"ఏం చేశావు?"

"చెరో గదిలో పెట్టి...."

"ఒక గదిలోనే పెడితేనేం?"

"ఈ దెయ్యమూ, హిస్టీరియా ఒకవాన్ని ఒకటి పీక్కు తినెయ్యవూ ?"

"అర్థమయ్యింది. నీ పని కష్టమే! ఒకసారి రెండు కేసులొస్తే!"

"రెండా! ఒక్కొక్కవూళ్ళో ఒక్కసారే పన్నెండు వుండేవి."

"అబ్బా! అ దేవూళ్ళో బాబా!"

"ఏదో వూరులే"

"పోనీ, నన్ను అసిస్టంటుగా వేసుకోరాదూ?"

"విను ముందు! విన్న తరవాత నీ టీచరుపనికి రాజీనామా పెట్టడం యోచించవచ్చు. చెరో గదిలో పెట్టి యిక్కడ మంత్రం, అక్కడ మందూ; యిక్కడ మందూ, అక్కడ మంత్రం పెట్టుకుంటో పరుగులెత్తాలి. ముఖ్యంగా ఆ ఆడబిడ్డ దెయ్యముందే, అది మహాగట్టిది; చాలా కష్టం వొదల్చడం.

"చాలా యిరుకైన స్థానాన పట్టింది. అరగంటైనా స్వాధీనంగాదు. నన్నుకక్కణ్ణించి కదలనివ్వదు. మీదపడుతుంది. రక్కుతుంది, పీకుతుంది బట్టలు చించిపారేస్తుంది. రోజూ వెళ్ళడం, నయంచేసి రావడం కుదరవు. కేసులు వొదులుకుంటే పేరు పోతుంది. మరి తక్కిన కేసులూ, నా సంసారం చూసుకునేందుకు వ్యవధీ, శక్తీ వుండాలా? రాత్రి సగం నిద్రలోనూ, మధ్యాన్నం అలిసి పడుకున్నా, అతని సన్నని కీచుగొంతు,

'డాక్టరుగారూ, మళ్ళీ దెయ్యం' అనేప్పటికల్లా, నా ప్రాణాలు యెగిరి వొయ్యేవి. ఆఖరికి యీ వొత్తిడితో నాకే జబ్బుచేసేట్టు తోచి, ఆ వర్త కుడికి ఒక వుపాయం చెప్పాను. ఈ వుపాయాల్లోనే వుంది తెలివంతా.

"మీ యింటో మొగదక్షత లేక, దెయ్యాలకి చులకనయింది. నీ భార్యది కూడా ఒక విధంగా దెయ్యమే. కనక మీ యింటో ఒక గది— వరండాలోది కాదు, ఇంటి మధ్యది—నలుగురు ధైర్యమూ, బలమూ గల కాలేజి కుర్రవాళ్ళకి అద్దెకిచ్చావంటే, యింక దెయ్యా లావేపు రావు. హడిలి పారిపోతా"యన్నాను.

బుద్ధిమంతుల్ని, నీతి ప్రవర్తన గలవారినీ మీరే కుదిర్చి పెట్ట మన్నాడు.

మరి నాకు అంత ఫీజు యిచ్చిన వాడి ప్రార్థనని ఎట్లా నిరాక రించను? కుర్రవాళ్ళని యేర్పరిచి, మళ్ళీ దెయ్యాలు ఆవేపు చేరకుండా, ఆంజనేయమంత్రం వాళ్ళ కుపదేశించి ప్రవేశ పెట్టాను. అంతటితో 'దేవుడా బైటపడ్డా'నని యితర కేసులు చూచుకుంటున్నాను."

"కథ బావుందిగాని—"

"ఐపోందే! ఒక్క రాత్రి మళ్ళీ ఆ వర్తకుడు వొచ్చాడయ్యా"

"వొచ్చి?"

"మళ్ళీ దెయ్యం వొచ్చిందండి!" అన్నాడు.

"అరే! నేను కాపలి పెట్టినవాళ్ళు-" అన్నాను.

"వున్నారు. మీధర్మమా అని అప్పట్నించి వాళ్ళిద్దరూ చాలా కులాసాగా వున్నారు. కాని యీసారి....మా తల్లికి........"

నా గుండె ఆగింది. చచ్చాననుకున్నాను.

ఆ తల్లికి అరవైయేళ్ళు. అంత ముసలిదానికి ఏ డాక్టరు మందియ్య గలడు చెప్పు? ఏం తోచలేదు. తెల్లారేటప్పటికి మందు తయారు చేసుకొస్తానని చెప్పి ఆ రాత్రే ఆపూరూ, ఐదారు చక్కనికేసులూ వొదులుకుని పలాయనమైనాను. ఏం? నా అసిస్టంటుగా వొస్తావా? ఇంకా ఆ ముసలామెకి—"

స్నేహితుడు ఆ చుట్టుపక్కల కనిపించలేదు.

★

# కలియుగ ధర్మం

కృతయుగంలో-ఒకటో పాదంలో దుందుభి నామ సంవత్సర కార్తీకశుద్ధ త్రయోదశి ఉదయాన సుముహూర్తమందు శౌనకాది మహర్షు లందరూ కాలకృత్యాలు తీర్చుకుని స్నానాలు చేసి వీభూది ధరించి దర్భాసనాలమీద సూతమహర్షి చుట్టూ చేరి కూచున్నారు. అప్పుడు శౌనక మహర్షి యేమన్నాడంటే?

"గురువర్యా, కలికాలము, కలికాలము అంటారు. అప్పుడు ధర్మము ఒక పాదం మీదే నడుస్తుందంటారు. ఎంత ఆలోచించినా మా దృష్టికి ఈ విషయం గోచరం కావటంలేదు. అంతులేనిదీ, ఆత్మానంద కరమైనదీ, సమస్త సౌభాగ్యకరమైనదీ ఐన యీ ఆధ్యాత్మిక సంపదను వొదిలి ప్రజలు విషయలోలురూ, ధర్మవిచ్ఛేదకులూ ఎలా కాగలరో మా మనస్సులకు గోచరము కావడములేదు. తమరు మాకు విశదమయ్యేట్లు బోధ చెయ్యవలెనని కోరుకుంటున్నాము" అన్నారు.